క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రీరామాలయ ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

బలిజిపేట: మండలంలోని బర్లిలో శ్రీరామాలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సూర్యనమస్కారాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, మంటప అర్చనలు, సర్వదేవతా హోమాలు, ఆరోగ్యప్రదాత సూర్యనారాయణ స్వామికి సూర్యనమస్కారాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమాన్ శిలా విగ్రహాలకు, ఉత్సవ విగ్రహాలకు ధ్యానం, అభిషేకం, మట్టితో చేసిన 116లింగాలకు పంచామృతాలతో అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గోశాలల నిర్మాణానికి ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: మండలంలో పాడిపశువులున్న రైతులకు గోశాలలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి సమర్పించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన 'పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి' అనే వార్తకు ఆయన స్పందించారు. గోశాలల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు. అలాగే పాలకు గిట్టుబాటు ధర చెల్లించే నిమిత్తం తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించినట్లు ప్రకటనలో స్పష్టం చేశారు.

ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎంల నియామకం

సీతానగరం: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించడంతో వివిధ ఉన్నత పాఠశాలల్లో ఖాళీలున్న ప్రధానోపాధ్యాయులను నియమిస్తూ మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పూర్తి బాధ్యతలతో బూర్జ, జగ్గునాయుడుపేట, నిడగల్లు, మరిపివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలకు కొత్త హెచ్‌ఎంలు రానున్నారు. నిడగల్లు హెచ్‌ఎంగా ఎస్‌ఎల్ పాత్రుడు, జగ్గునాయుడుపేట, హెచ్‌ఎంగా కాగాన వెంకటనాయుడు, మరిపివలస హెచ్‌ఎంగా గెంబలి విజయలక్ష్మి, బూర్జ హెచ్‌ఎంగా బి.సాంబశివరావులు నియమితులయ్యారు. సీతానగరం, గాదెలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్రస్తుతం ఉన్న ప్రధానోపాధ్యాయులే కొనసాగుతారు. నూతనంగా నియమితులైన హెచ్‌ఎంలలో ఇద్దరు బదిలీపై రాగా, ఇద్దరు పదోన్నతిపై హెచ్‌ఎంలుగా విధుల్లో చేరనున్నారు.


పనులు పూర్తిచేయండి ప్లీజ్..!



ఏడాది కాలంగా నిలిచిపోయిన రోడ్డు మరమ్మతులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 29వ వార్డులో కాలువ, రోడ్డు నిర్మాణ పనులను గత ప్రభుత్వంలో ప్రారంభించగా ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. పట్టణంలోని కుసుమగుడివీధి, గులిపల్లి వీధిలో వర్షం పడితే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరైనా పనులు పూర్తి చేయలేదని, దీనివల్ల ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, మున్సిపల్ అధికారులు తక్షణమే పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

జూన్ 2 నుంచి గ్రామాల్లో యోగాసన కార్యక్రమాలు



యోగాసనాల శిక్షణలో పాల్గొన్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్, వైద్యాధికారులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గుర్తించిన వారితో సోమవారం నుంచి యోగాసనాలు వేయించనున్నట్లు ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన యోగాసనాల శిక్షణ కార్యక్రమంలో ఆయనతో పాటు వైద్యాధికారులు డాక్టర్ పి.ఉషారాణి, డాక్టర్ టి.హేమాక్షి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గతమెంతో ఘనం.. వర్తమానం దీనం



రెండో విడతలో మంజూరై మధ్యలో పనులు నిలిచిన గాడివీధి అదనపు తరగతి గదుల నిర్మాణం



తొలి విడతలో నాడు-నేడులో అన్ని సౌకర్యాలతో గాడివీధి మున్సిపల్ పాఠశాల

సాలూరు రూరల్:

గత ప్రభుత్వం హయాంలో ఎంతో ఘనంగా అమలు చేసిన నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా సాలూరు మండలంలోని 174 పాఠశాలలకు గాను తొలివిడతగా 61 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు పాత భవనాలకు మరమ్మతులు చేపట్టి కొత్త భవనాల నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థుల తల్లితండ్రులు మెచ్చుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. అలాగే రెండవ విడతలో 41 పాఠశాలలు, అంగనవాడీ భవనాలను పునరుద్ధరించి పిల్లల తల్లిదండ్రులు, ఆయా గ్రామాల ప్రజల మెప్పును చూరగొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు కనీసం పాఠశాలల అభివృద్ధిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తొలివిడత పనులు పూర్తి

మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాలూరు పట్టణంలోని రెండు మున్సిపల్ హైస్కూల్స్‌తో పాటు 102 పాఠశాలలకు నాడునేడు కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించి తొలివిడతలో దాదాపు పూర్తిచేసింది. రెండో విడతలో నిధులు మంజూరు చేయగా కొన్ని పాఠశాలల పనులు మధ్యలో నిలిచిపోయాయి. సాలూరు పట్టణంలోని గాడివీధి మున్సిపల్ హైస్కూల్ తొలివిడత నిధులతో పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు సౌకర్యవంతంగా బెంచీలు, మంచినీటి ప్లాంటు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో 450 మంది వరకు విద్యార్థులు అభ్యసిస్తున్నారు. దీంతో తరగతి గదులు చాలకపోవడంతో కొత్త తరగతి గదులకు కోటి రూపాయల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అయితే రూ.33 లక్షల నిధులు మంజూరుతో రెండు ఫ్లోర్ల నిర్మాణం జరిగింది. మిగిలిన నిధులు విడుదల చేసే సమయానికి ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం మున్సిపల్ హైస్కూల్‌లో తరగతి గదులు విద్యార్థులకు చాలడం లేదు. మధ్యలో నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



గ్రామాల్లోని పాఠశాలలకు గత ప్రభుత్వం కల్పించిన సౌకర్యవంతమైన బెంచీలపై విద్యార్థులు (ఫైల్)

వెలవెల బోతున్న కుట్టుశిక్షణ

- 60 మంది శిక్షణ ఇవ్వడానికి నిర్దేశం
- మొదటి రోజు 55 మంది
- రెండవరోజు 20 మంది హాజరు



వెలవెలబోతున్న కుట్టు శిక్షణ కేంద్రం

సీతానగరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆదరాబాదరాగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని బీసీ కార్పొరేషన్ అధికారులు ప్రారంభించడంలో గల అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వందలాది మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి కుట్టు శిక్షణ కార్యక్రమం చేపట్టడం మంచిదే అయినా ఆదరాబాదరాగా ఎటువంటి సమాచారం లేకుండా ప్రారంభించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడైనా ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, బీసీ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో ప్రారంభించాల్సి ఉంది. అధికారికంగా ఈ నెల 28న ప్రారంభించినట్లు సంబంధిత సిబ్బంది చెబుతున్నారు. 29న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ కుట్టుశిక్షణ కేంద్రాన్ని సందర్శించడంతో ఉన్నత పాఠశాలలో కుట్టు శిక్షణ ఇవ్వనున్నారని ప్రజలకు తెలిసింది.ఎవరికీ ఎటువంటి సమాచారం లేకుండా శిక్షణ కేంద్రం ప్రారంభించడంతో శుక్రవారం 60 మంది మహిళలు హాజరు కావాల్సి ఉండగా కేవలం 20 మంది హాజరు కావడం విశేషం.

వివరాల్లోకి వెళ్తే..

మండలంలో నిరుద్యోగులైన మహిళలు, గృహిణులు కుట్టుశిక్షణ పొందాలని వందలాది మంది ఎంపీడీఓ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్నారు. అప్పట్లోనే అధికార పార్టీకి చెందిన వారి ఇళ్లలో మహిళల పేర్లు నమోదు చేశారు. ఎంపిక చేసిన వారిలో 120 మందికి రెండు విడతల్లో శిక్షణ ఇవ్వడానికి 60 మంది హాజరు కావాల్సి ఉంది. 60 మందికి గాను 20 మంది పాల్గొన్నారు. వారికి అవసరమైన 20 కుటు మిషన్లు ఉన్నత పాఠశాలకు చేర్చారు. కేంద్రం నిర్వహించడానికి ఒక మహిళా ఇన్‌చార్జిని, ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించారు.శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా 20 మందికి మించి రావడంలేదు. కుటుశిక్షణపై ఉత్సాహం చూపిన వారందరికీ అవకాశం కల్పించాలని కోరినా ఎవరూ పట్టించు కోలేదని ఆరోపణలు వస్తున్నాయి. కుట్టుశిక్షణ ఇవ్వడానికి రాజకీయం చేయడంపై మహిళలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కుట్టుమూర్తుల తయారీపై ఆసక్తి కలిగిన వారందరికీ శిక్షణ ఇవ్వాలని కోరుతున్నారు. కుట్టుశిక్షణ కేంద్రం ఇన్‌చార్జి శ్యామల మాట్లాడుతూ ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చేలా పర్యవేక్షణ చేయడం వరకే తన బాధ్యతన్నారు. వచ్చిన వారందరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ వద్ద కుట్టుశిక్షణ విషయమై ప్రస్తావించగా ఉన్నతాధికారులు కుట్టుశిక్షణ కేంద్రాన్ని సందర్శించాలని గురువారం కోరడంతో కేంద్రాన్ని పరిశీలించగా కుట్టుశిక్షణ జరుగుతోందని చెప్పారు.

ఎంఈవో సేవలు మరువలేనివి

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఎంఈవో సత్యనారాయణకు జ్ఞాపికను బహూకరిస్తున్న మాజీ డిప్యూటీసీఎం రాజన్నదొర

మక్కువ: ఎంఈవో పెంట సత్యనారాయణ మండల విద్యాశాఖకు అందించిన సేవలు మరువలేనివని మాజీ డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈవోగా ఉద్యోగ విరమణ పొందుతున్న సత్యనారాయణకు ఉపాధ్యాయులంతా కలిసి స్థానిక సాయి భగవాన్ కల్యాణ మంటపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, విశ్రాంతి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతిరావు, ఇన్‌చార్జ్ డీఈవో బి.రాజ్‌కుమార్, టీడీపీ నాయుకులు మావుడి ప్రసాదరావు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీసీఎం రాజన్నదొర మాట్లాడుతూ ఎంఈవోగా సత్యనారాయణ ఇంత వరకు విధులు నిర్వహించి, పదవీవిరమణ పొందుతున్నప్పటికీ మండల విద్యాశాఖకు ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రశంసించారు. సత్యనారాయణ తన బాల్య స్నేహితుడని, చిన్నతనం నుంచి సమాజానికి ఏదో సేవచేయాలన్న సంకల్పంతో మెలిగే వారని డిప్యూటీ సీఎం రాజన్నదొర అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ.స్వరూపారాణి, ఎంఈవో శ్యామ్‌సుందర్, ఐసీడీఎస్ సీడీపీవో బి.అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సోలార్ రూఫ్‌టాప్‌తో ప్రయోజనాలు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

పార్వతీపురంటౌన్: సోలార్ రూఫ్‌టాప్‌తో ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని విద్యుత్‌శాఖ డీఈ ఫణికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌లను నిర్మించుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని చెప్పారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహ వినియోగదారులకు ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఒక కిలోవాట్‌కు 120యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని దీనికి ప్రభుత్వం రాయితీ రూ.30వేలు అందజేస్తుందని, 2కిలోవాట్‌లకు 240 యూనిట్ల ఉత్పత్తి చేయవచ్చని దీనికి ప్రభుత్వం రూ.60వేల రాయితీ ఇస్తుందని, మూడు కిలోవాట్‌లకు 360యూనిట్ల ఉత్పత్తి చేయవచ్చునని ప్రభుత్వం రూ.78వేలు రాయితీ ఇస్తుందని తెలిపారు. అవకాశం ఉన్నంతవరకు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పనిదినాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ సీహెచ్‌వీ రమణారావు, విద్యుత్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



బలిజిపేట ప్రజా సంఘాల కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన నాయకులు

బలిజిపేట: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల సమన్వయ కన్వీనర్ లక్ష్మి పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశ కార్మికవర్గ కష్టాలు తీర్చేది సీఐటీయూ జెండానే అని స్పష్టం చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది సీఐటీయూనే అన్నారు. 1970లో బెంగాల్‌లో మే. 30న సీఐటీయూ ఆవిర్భవించిందని చెప్పారు. నాటినుంచి నేటివరకు కార్మికుల పక్షాన నిలిచి ఎన్నో పోరాటాలు చేసి కార్మికుల సమస్యలపై దృష్టిసారించిందన్నారు. ఐక్యతా పోరాటం నినాదంతో రాజీలేని పోరాటాలు సీఐటీయూ చేసిందని చెప్పారు. ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, ఆప్కాస్, కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై స్పందించిందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వేణు, జి.సత్యనారాయణ, సాంబమూర్తి, ఆటోయూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించి అనంతరం నాయకులు మాట్లాడుతూ 1970లో కొన్ని వందల మంది సభ్యులతో ప్రారంభమైన సీఐటీయూ నేడు 65 లక్షల మంది సభ్యులతో దేశంలో అత్యున్నత పోరాట స్ఫూర్తిని కలిగిస్తోందన్నారు. అనేక ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థల కార్మికుల సమస్య పరిష్కారాల్లో సీఐటీయూ పాత్ర కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, స్థానిక సీఐటీయూ నాయకులు కె.పార్వతి, బోను గౌరునాయుడు, పిన్నింటి రమేష్, లంక గోవింద తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీఐటీయూ పోరాటం

పార్వతీపురం: ప్రజల పక్షాన నిరంతరం సీఐటీయూ పోరాడుతుందని సీఐటీయూ నాయకులు బీవీ.రమణ, జీవీ రమణలు అన్నారు. ఈ మేరకు సీఐటీయూ ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాతబస్‌స్టాండ్‌లో సీఐటీయూ జెండాను శుక్రవారం ఆవిష్కరించి వివిధ రంగాల కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మిక నాయకులు పి.సన్యాసిరావు, పి.గంగాధర్, సీహెచ్.సింహచలం, ఎస్.శంకరరావు, ఎం.శివ, బి.రవి, భానుమూర్తి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం, దేశ సమైక్యతకు పాటుపడాలి



బలిజిపేటలో సమైక్యతా యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం



సాలూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: ఉగ్రవాద వ్యతిరేక పోరాటం పేరుతో అమెరికాకు లొంగిపోయిన ప్రధాన మంత్రి మోదీ, ప్రధాన మంత్రికి లొంగిపోయిన టీడీపీ, జనసేనలు చేస్తున్న మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో బలిజిపేటలో సమైక్యతా యాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు, మండలనాయకుడు మన్మథరావులు మాట్లాడుతూ పాకిస్తాన్ టెర్రరిస్టుల ఉగ్రదాడిని ఖండించడంలో దేశప్రజలు ప్రదర్శించిన ఐక్యత, సమైక్యత మత సామరస్య స్ఫూర్తి దేశప్రజలందరినీ ఒక్కతాటిపై నిలిచేలా చేసిందన్నారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని రెండు మతాల మధ్య, దేశాల మధ్య యుద్ధంగా మార్చవద్దని సీపీఎం మొదటినుంచి కోరుతోందన్నారు. మహానాడులో ప్రధాని మోడీని టీడీపీ పొగడడం మతోన్మాదాన్ని బలపరచడమేనన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అన్ని తరగతులు, మతాలు, కులాలు, వర్గాల ప్రజల సమైక్య స్ఫూర్తి తీసుకోవాలని, మతపరమైన విభజనకు తావులేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని, వెంటనే ఉగ్రవాదులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, బి.భానుమూర్తి, డి.త్రినాథ, జి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడాలి

సాలూరు రూరల్: దేశంలో మత సామరస్యం, దేశ సమగ్రత విషయంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ద్వంద్వ నీతి పాటించకుండా మత సామరస్యాన్ని కాపాడేందుకు కృషిచేయాలని సీపీఎం నాయకుడు ఎన్‌వై నాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సమైక్య యాత్ర పిలుపులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడుల తర్వాత దేశంలో ప్రజలంతా సమైక్యతను చాటుకున్నారన్నారు. ఈ తరుణంలో దేశాన్ని ఐక్యంగా ఉంచాల్సిన ఎన్డీఏ, బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రజల మధ్య చీలిక వచ్చేవిధంగా యత్నిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు టి.రాముడు, రవి, రామకృష్ణ, శంకర్, లక్ష్మి పాల్గొన్నారు.

నారాయణపురం మీదుగా పార్వతీపురం బస్సు వేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: పార్వతీపురం నుంచి బలిజిపేట వరకు నారాయణపురం మీదుగా బస్సును నడపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ నారాయణపురం వద్ద వంతెన నిర్మాణం పూర్తయి ఇప్పటికే వాహనాల రాకపోకలు సాగుతున్నాయని బస్సు వేయడం వల్ల బలిజిపేట నుంచి పార్వతీపురం వెళ్లే ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గుతాయన్నారు. నారాయణపురంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నందున నీలకంఠేశ్వర ఆలయం నుంచి పెదంకలాం పిల్ల కాలువ మీదుగా బైపాస్ రోడ్డు ఏర్పాటుచేయాలని కోరారు. బలిజిపేట నుంచి జిల్లా కేంద్రం పార్వతీపురం వెళ్లాలంటే ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రజలకు మేలు చేయాలని కోరుతూ తహసీల్దార్ రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.వేణు, డి.త్రినాథ, పి.వెంకటస్వామి, జి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ ప్రతిరోజూ మంచినీరు సరఫరా చేయాలి

- ప్రజాసంఘాల డిమాండ్



మున్సిపల్ మేనేజర్ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామదేవత పండగ సమీపిస్తున్న వేళ పార్వతీపురం పట్టణంలో ప్రజలకు అవసరమైన మంచినీటిని ప్రతిరోజూ సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగుకు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల నాయకుడు పాకల సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం మున్సిపల్ మేనేజర్ లక్ష్మి, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుగోపాలనాయుడులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా పార్వతీపురం పట్టణంలో మంచినీటి సరఫరా తీవ్ర సమస్యగా ఉందని, మంచినీటి సరఫరా మెరుగుకు గత ప్రభుత్వం సుమారు రూ.67కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మంచినీటి సరఫరాలో ఉన్న సమస్యలను అధిగమించి పూర్తిస్థాయిలో మంచినీటిని సరఫరా చేసేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామ దేవత పండగకు లక్షలాది మంది ప్రజలు వచ్చే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు తక్షణమే ఫాగింగ్ ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా..

పండగ వేళ విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని దానికి తగిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర యంత్ర సామగ్రి, సిబ్బందిని సమకూర్చి పట్టణంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. దీనికి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుగోపాల్ నాయుడు, ఏడీఈ రమణమూర్తి స్పందిస్తూ ఇప్పటికే పట్టణంలో పూర్తిస్థాయిలో మెయింటనెన్స్ పనులు చేశామని, పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు తగిన విధంగా యంత్రసామగ్రిని, సిబ్బందిని సమకూర్చుకున్నామని పండగ వేళ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొర్లి వెంకటరమణ, బీవీ రమణ, పల్లి గంగాధర్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం: ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023-2024 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒక విడత మాత్రమే ప్రభుత్వం ఫీజు రియింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసిందని, మిగిలిన విడతల నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ కారణంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు ప్రభుత్వం కళాశాలల ఖాతాలలోనే జమ చేస్తుందని, విద్యార్థుల నుంచి యాజమాన్యాలు కట్టించుకుంటే ఎలా అని ప్రశ్నించారు. అక్రమంగా ఫీజులను వసూలు చేస్తున్న కళాశాలలను గుర్తించి వాటి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధిలో ఉన్న యర్రాకృష్ణమూర్తి కాలనీలో ఇళ్లను ఆనుకుని విద్యుత్ తీగలు ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇంటి నిర్మాణాన్ని ఆనుకుని విద్యుత్ స్తంభాలు గతంలో ఏర్పాటు చేయడంతో ఆ విద్యుత్ స్తంభాలనుంచి సరఫరా నిమిత్తం ఏర్పాటైన విద్యుత్ తీగలు నిర్మాణాలకు అంటుకుని ఉండడంతో గాలి వీచినా, వర్షాలు పడేటప్పుడు, పక్షులు వాలేటప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది స్పందించి ఇంటి నిర్మాణాలకు దూరంగా విద్యుత్ తీగలను మళ్లించే విధంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సిరిమాను చెట్టు తరలింపు



ఎర్రకంచమ్మ సిరిమాను కోసం ఎడ్ల బండిపై తరలించేందుకు సిద్ధం చేస్తున్న యువత

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో జూన్ 1,2,3 తేదీల్లో నిర్వహించే ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ గ్రామ దేవతల పండుగ సిరిమాను చెట్లను ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపిక చేసి ఆ సిరిమాను చెట్లకు పూజలు చేసే క్రతువును శుక్రవారం నిర్వహించారు. అనంతరం పార్వతీపురంలో ఉన్న గ్రామ దేవతల ఆలయాల సమీపంలోకి సిరిమాను చెట్లను తరలించారు. ఎర్రకంచమ్మ, ఇప్పల పోలమ్మ సిరిమానుల చెట్లను పార్వతీపురం మండలంలోని లక్ష్మీనారాయణపురం, రాదంపేట, గడబవలస గ్రామాల సమీపంలో గుర్తించి పూజల అనంతరం ఎడ్ల బండిపై తరలించారు.